
సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 14 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి కోసూరి వంశీకృష్ణ రాజు, రాజశ్రీ దంపతులు (హైదరాబాద్‌) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్‌ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,300, సెంట్రల్‌ 1,400, పశ్చిమ డెల్టాకు 3,700 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.45 అడుగులకు చేరింది.

గరిష్టం/కనిష్టం
44.0° / 30.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	30.0
కాకినాడ	42.6	29.7
అమలాపురం	42.0	28.0

న్యూస్‌రీల్‌

డీఎఫ్‌ఆర్‌సీని సందర్శించిన కేంద్రమంత్రి



డీఎఫ్‌ఆర్‌సీని పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్‌

కడియం: కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్‌ మంగళవారం మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. వేమగిరిలోని డివిజినల్‌ ఫ్లోరీకల్చర్‌ రీసెర్చ్‌ సెంటర్‌ (డీఎఫ్‌ఆర్‌సీ)ని సందర్శించారు. ఉద్యాన పంటల సాగులో డీఎఫ్‌ఆర్‌సీ అందిస్తున్న సేవల గురించి ప్రధాన శాస్త్రవేత్త డీవీవీఎస్‌ రాజు వివరించారు. అనంతరం కడియపులంకలోని గంగుమళ్ల సత్యనారాయణ నర్సరీని మంత్రి సందర్శించారు. అక్కడ నర్సరీ రైతులు, బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. బీజేపీ నాయకులు ఆకుల శ్రీధర్‌, బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, పన్నాల వెంకటలక్ష్మి, నాగులాపల్లి వీరబాబు, పాటంశెట్టి రాజేష్‌, బొర్సు సుబ్రహ్మణ్యం తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

15 నుంచి ఐటీఐ కౌన్సెలింగ్‌

రాజమహేంద్రవరం రూరల్‌: తూర్పు గోదావరిజిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 15న ధవళేశ్వరం వద్ద కలెక్టరేట్‌ వెనుక ఉన్న ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఐటీఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ కె.విజయభాస్కర్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ అయిన అభ్యర్థులు పదోతరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీసర్టిఫికెట్‌, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌ కార్డుతో పాటు సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ పత్రం, ఒరిజినల్స్‌తో పాటు జత జిరాక్స్‌ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

షెడ్యూల్‌ వివరాలిలా..

తేదీ	జీపీఏ	ర్యాంక్‌	సెషన్‌
15.06.23	10–5.6	1–116	ఉదయం 9 గంటలకు
15.06.23	5.3–2.4	117–216	మధ్యాహ్నం 2 గంటలకు

డీపీఓగా సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్‌: రాజమహేంద్రవరం డివిజనల్‌ పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ మంగళవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. శనివారం ఆయన కలెక్టర్‌ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు.

అధ్యాపకుల పోస్టుల భర్తీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా ప్రాజెక్ట్‌ సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న లెక్చరర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌.అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌ తేదీకి 50 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా ప్రాజెక్ట్‌ కార్యాలయం, సమగ్రశిక్ష, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం అనే చిరునామాకు చేరేలా పంపాలని వివరించారు. మరిన్ని వివరాలకు సమగ్ర శిక్ష ఆఫీసు, రాజమహేంద్రవరం, ఫోన్‌ నెంబరు 98487 46495లో సంప్రదించవచ్చని అన్నారు.

ఈ-ఆటోలొచ్చాయ్‌...



కొవ్వూరు మున్సిపాలిటీకి చేరుకున్న ఈ-ఆటోలు

కొవ్వూరు: క్లీన్‌ ఆంధ్రప్రదేశ్‌ (క్లాప్‌) పథకంలో భాగంగా కొవ్వూరు మున్సిపాలిటీకి పది ఆటోలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. ఇవి పూర్తిగా విద్యుత్తు చార్జింగ్‌తో పనిచేస్తాయి. ఈ ఆటోకి ఒక్కసారి కరెంట్‌ చార్జింగ్‌ పెడితే 60 కిలోమీటర్లు నడుస్తుందని అధికారులు చెబుతున్నారు. తద్వారా పురపాలక సంఘానికి ఆటోల నిర్వహణ ఖర్చులు ఆదా కానున్నాయి. మున్సిపల్‌ పారిశుధ్య సిబ్బంది వీటితో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ చేస్తారు. ఈ ఆటోలపై సీసీ కెమెరాతో పాటు చెత్త సేకరణకు వెళ్లే సమయంలో ప్రచారం చేసేందుకు అనువుగా మినీ మైక్‌ సెట్‌ సైతం అమర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన మున్సిపాలిటీలకు క్లాప్‌ పథకం ద్వారా వీటిని అందజేశారు. జిల్లాలోని నిడదవోలు మున్సిపాలిటీకి ఆరు, కొవ్వూరుకు పది అందించారు. త్వరలోనే ఈ-ఆటోల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

స్పందిస్తే మీరూ ప్రాణదాతే..



- రాజమహేంద్రవరం రూరల్‌ మండలానికి చెందిన 14 ఏళ్ల జ్యోతి తలసేమియా బాధితురాలు. ఐదు రోజులుగా రక్తం కోసం ఆస్పత్రిలో ఎదురు చూస్తోంది.
- కాకినాడ జిల్లా కత్తిపూడి సెంటరులో ట్రాక్టర్‌ బోల్తా పడిన దుర్ఘటనలో ఇద్దరికీ తీవ్ర రక్తస్రావమైంది. కాకినాడ తరలించారు. అత్యవసరంగా రక్తం ఎక్కిస్తే తప్ప బతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. ఆ క్లిష్ట సమయంలో రక్తం కోసం బాధితుల కుటుంబీకులు చాలా కష్టాలు పడ్డారు.

- రక్తదానానికి అవరోధంగా అపోహలు
- విస్తృతంగా అవగాహన పెరగాల్సిన అవసరం
- స్వచ్ఛంద సంస్థల పాత్ర అమోఘం
- నేడు రక్తదాతల దినోత్సవం

డెస్క్‌– రాజమహేంద్రవరం: తరచూ ఎదురవుతున్న రక్త కొరతకు ఈ రెండూ ఉదాహరణలు మాత్రమే. సాధారణంగా రోడ్డు ప్రమాదాలు.. తలసేమియా.. కేన్సర్‌.. ప్రసవ సమయాలు.. శస్త్రచికిత్సల సందర్భంలోను రక్తం చాలా అవసరం. కానీ ఆపద వేళ రక్త లభ్యత సవాలుగా మారుతోంది. రక్తదానం ఒక్కటే ఇందుకు పరిష్కారం. దీనిపై అవగాహన ఉన్నవారు సైతం ముందుకు రావడం లేదు. దేశంలో ఏటా 4 కోట్ల యూనిట్ల రక్త నిల్వలు అవసరమవుతుంటే సమకూరుతున్నది 50 లక్షల యూనిట్ల లోపే. ఒక్క కాకినాడ జీజీహెచ్‌లోనే రోజుకు వెయ్యి యూనిట్లు అవసరమని చెబుతున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు స్పందించి సహకారం అందిస్తున్నా పూర్తి స్థాయిలో కొరత తీరడం లేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తలసేమియా బాధితులే 400 మందికి పైగా ఉన్నారు. వీరికి ప్రతినెలా రక్తం అవసరం.

అపోహలు

చాలామంది చదువుకున్న వారు కూడా రక్తదానానికి ముందుకు రావడం లేదని వైద్యవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై అపోహలు కలిగి ఉండటమే ఇందుకు కారణం. 18 నుంచి 65 సంవత్సరాల వయసున్న ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయవచ్చు. వాస్తవానికి ప్రతి మూడు నెలలకూ రక్తం ఇవ్వడం మంచిది కూడా. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్లేట్‌లెట్లు ఇవ్వవచ్చు. ఒక వ్యక్తి జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చు. రక్తదానం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని డాక్టర్లు చెబుతున్నారు. రక్తదానంతో ముగ్గురిని కాపాడవచ్చు. ఇందులోని ఎర్ర రక్త కణాలతో రక్తహీనత రోగిని.. ప్లాస్మాతో ఒకరిని.. ప్లేట్‌లెట్లతో మరొకరిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీ ద్వారా రక్తాన్ని 8 కాంపోనెంట్లుగా విభజించి, భద్రపరచి రోగులకు అందజేయగలుగుతున్నారు. రక్తదానం చేసినప్పుడు ఏర్పడిన నష్టం 4 నుంచి 8 రోజుల్లో భర్తీ అవుతుంది.

శిబిరాలతో ప్రయోజనం

ఇటీవల కొంత మార్పు వచ్చింది. పుట్టిన రోజు వంటి సందర్భాల్లో కొంతమంది రక్తదానం చేస్తున్నారు. ఈ ఏడాది జూలైలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేయాలని పిలుపునిస్తే మంచి స్పందన వచ్చింది. వైఎస్సార్‌ సీపీ శ్రేణులు ముందుకొచ్చి ఉత్సాహంగా రక్తదానం చేశారు.

రక్తదానంలో మహిళా చైతన్యం

రక్తదాతలుగా మహిళలు పదేళ్లుగా తమ ఆదర్శాన్ని చాటుకుంటున్నారు. మండపేట కేంద్రంగా వైశ్య లేడీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ మహిళా బృందం వ్యవస్థాపక అధ్యక్షురాలు వానరాసి శ్రీదేవి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో దాతలంతా మహిళలే కావడం గమనార్హం.



వైశ్య వెల్ఫేర్‌ లేడీస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యాన రక్తదానం చేస్తున్న మహిళలు

‘చిన్ని’ సాయం.. ఎంతో మిన్న



కాకినాడ రూరల్‌ మండలం రేపూరుకు చెందిన ఇతని పేరు ముమ్మిడి వెంకట రమణ (చిన్ని). ఇతను కొవ్వాడలో చిన్న ఫ్యాన్సీ స్టోర్‌ నడుపుతున్నాడు. పదుగురికీ సాయపడటం చిన్ని నైజం. 2000 నుంచి ఇప్పటి వరకూ 73 సార్లు రక్తదానం చేశాడు. ఇతని బ్లడ్‌ గ్రూపు ‘ఒ’ నెగిటివ్‌. ప్రమాదాల సమయంలో రక్తం చాలా అవసరమని గుర్తించి రక్తదానం చేయాలని స్నేహితులను కూడా ప్రోత్సహిస్తుంటాడు.

ఫ్రెండ్స్‌ టు సపోర్ట్‌

హైదరాబాద్‌లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి షరీఫ్‌ 2005లో ‘ఫ్రెండ్స్‌ టు సపోర్ట్‌’ అనే స్వచ్ఛంద రక్తదాన వెబ్‌సైట్‌ను పరిచయం చేశారు. కాకినాడకు చెందిన గుమ్మల శివప్రసాద్‌ పూర్తి కోస్తా జిల్లాల బాధ్యతలు చూస్తున్నారు. వీరి వెబ్‌ ప్లాట్‌ఫాంలోకి లాగిన్‌ అయి, సమీపంలోని రక్తదాతల వివరాలు, ఫోన్‌ నంబర్‌ సేకరించి రక్తదానం కోరవచ్చు. మనం ఉండే ప్రాంతం పిన్‌కోడ్‌ ఆధారంగా సెర్చ్‌ చేయవచ్చు. ఇందులో పేరు నమోదు చేసుకున్న ఏ దాతా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా రక్తం ఇచ్చి వెళతారు. ఇందులో ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచే సుమారు 8,000 మంది దాతలు నమోదయ్యారని వేగేశ్న మోనిక చెప్పారు. ‘ఫ్రెండ్స్‌ టు సపోర్ట్‌’ సేవలను మరింత విస్తరించేందుకు హైదరాబాద్‌లోనూ పని చేస్తున్నానన్నారీమె. ‘ఫ్రెండ్స్‌టుసపోర్ట్‌.ఆర్గ్‌ భారత్‌ సహా యెమెన్‌, నేపాల్‌, బంగ్లాదేశ్‌, మలేషియా, ఒమన్‌, శ్రీలంక దేశాల్లో తన సేవలందిస్తోందని గుమ్మల శివప్రసాద్‌ తెలిపారు. గడచిన ఏడాదిలో 4 లక్షల మంది తమ సంస్థ వేదికగా రక్తదానం చేశారన్నారు. ఈ సంస్థ 2015లో భారత ప్రభుత్వం నుంచి ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకుంది.



‘ఫ్రెండ్స్‌ టు సపోర్ట్‌’ జోనల్‌ కో ఆర్డినేటర్‌ శివ ప్రసాద్‌కు కాకినాడ కలెక్టర్‌ కృతిక శుక్లా సత్కారం

ఉభయ గోదావరి జిల్లాల్లో సేవలు



రెండేళ్ల క్రితం వైఎస్సార్‌–జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌ బ్యాంకు ప్రారంభించాం. ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యవసర కేసులకు ఏటా 9 వేల నుంచి 10 వేల యూనిట్ల వరకూ రక్తం అందిస్తున్నాం. డాక్టర్‌ జాగృతి నాగేశ్వరరావు పర్యవేక్షణలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాం. జక్కంపూడి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో రక్తసేకరణకు శిబిరాలు నిర్వహిస్తున్నాం. వైఎస్సార్‌, రామ్మోహనరావుల ఆశయ సాధనకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్‌ జక్కంపూడి రాజశ్రీ, ట్రస్టీ, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్‌

తలసేమియా బాధితుల కోసం



30 ఏళ్లుగా మా సమితి సారథ్యంలో సేవలందిస్తున్నాం. 2003 నుంచి రక్తదాన శిబిరాలపై ఫోకస్‌ పెట్టాం. ముఖ్యంగా తలసేమియా బాధితులకు అండగా నిలవాలనే సంకల్పంతో పని చేస్తున్నాం. ఇప్పటి వరకూ సుమారు 45 వేల యూనిట్ల బ్లడ్‌ సేకరించి బ్యాంకులకు అందజేశాం. బుధవారం పేపరు మిల్లు వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాం.

– విక్రమ్‌జైన్‌, జైన్‌ సేవా సమితి, రాజమహేంద్రవరం

డిజిటల్‌ విధానంలో మెరుగైన బోధన

జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ కె.మాధవీలత



డిజిటల్‌ తరగతులపై విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్‌ డాక్టర్‌ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్‌: విద్యా విధానంలో కొత్త ఆవిష్కరణల ద్వారా మరింత నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు కలెక్టర్‌ డాక్టర్‌ కె.మాధవీలత అన్నారు. బొమ్మూరులోని జీపీఆర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను కలెక్టర్‌ మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్‌ తరగతి బోధనా పద్ధతులను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాధవీలత మాట్లాడుతూ, మెరుగైన విద్యను అందించే క్రమంలో ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌ బుక్స్‌, సకాలంలో అందజేస్తోందన్నారు. 10వ తరగతి పిల్లలకు డిజిటల్‌ రూపంలో బోధిస్తున్నట్లు తెలిపారు. జీవితంలో లక్ష్యాలను సాధించడానికి పక్కా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. ఇందుకు బాగా కష్టపడటం ముఖ్యమన్నారు. డిజిటల్‌ రూపంలో తరగతి గదులను ఆధునీకరిస్తున్నారన్నారు. నేడు అంతర్జాల వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో రాగులు, జొన్నలు, సజ్జలు వంటి ఆహార అలవాట్లు కేవలం పేద కుటుంబం వారి కోసం మాత్రమే అనే అపోహ ఉండేదని చెప్పారు. నేడు ఆరోగ్యం పట్ల ప్రజల్లో స్పృహ పెరిగిందన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను నిత్యం ఆహారంగా తీసుకుంటున్నారన్నారు. పిల్లలు మంచి పోషకాలతో కూడిన రాగి జావ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. స్కూల్స్‌లో ఉదయం పూట రాగి జావ అందిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పదార్థాలను ఆమె రుచి చూశారు. స్కూల్‌ ఆవరణలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. కలెక్టర్‌ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌.అబ్రహం, మండల విద్యాశాఖాధికారి తులసీదాస్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ.. సీఎం సర్‌



సీఎం జగన్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్‌ ఉద్యోగులు

సీతానగరం: సుమారు 23 ఏళ్లుగా ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా మార్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్‌ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సీతానగరం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో డిగ్రీ, జూనియర్‌ కళాశాల్లోని 15 మంది కాంట్రాక్ట్‌ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సేవాదళ్‌ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఉప సర్పంచ్‌ ద్వారంపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోరుకునేది వైఎస్‌ జగన్‌ ప్రభుత్వమన్నారు. సంక్షేమం కోసం ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే నిజమైన ముఖ్యమంత్రి జగన్‌ అని కొనియాడారు. కాంట్రాక్ట్‌ ఉద్యోగులు డాక్టర్‌ శర్మ, ఎస్‌.శివాజీ, దాసరి రాజు, కె.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, నరసింహం, కె.సురేష్‌ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నిర్ణయం తమ కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. తమకు కొత్త జీవితాన్ని ఇచ్చారన్నారు. ఎన్నో ఏళ్లుగా బాధపడుతున్న తమకు ఇన్నేళ్లకు భద్రత కల్పించారన్నారు. పార్టీ నాయకులు వలవల వల్లీ, కోసే సత్తిబాబు, మట్ట మునియ్య, బాబు బాబి తదితరులు పాల్గొన్నారు.

ఆశల వలతో సముద్రబాట

- నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేటకు అనుమతి
- ముగియనున్న వేట నిషేధం అమలు
- సుదీర్ఘ విరామం తరువాత గంగపుత్రుల్లో ఉత్సాహం



గంగమ్మ తల్లి కరుణించాలని మత్స్యకార మహిళలు కలశాలతో ఊరేగింపు

కాకినాడ రూరల్‌: సముద్రంలో చేపలు పట్టుకుని జీవనం సాగించేందుకు జిల్లాలో తీర ప్రాంత మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. 61రోజుల పాటు ఇళ్లకే పరిమితమైన గంగపుత్రులు వలలు దులుపుతున్నారు. చేపలు చిక్కాలని గ్రామ దేవతలకు పూజ చేసుకుని వేటకు సమయత్తమవుతున్నారు. సముద్రంలో చేపల వేట నిషేధం బుధవారం అర్ధరాత్రితో ముగియనుంది. చేపల పునరుత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మత్స్యశాఖ అధికారులు ఏప్రిల్‌ 15 నుంచి చేపల వేట నిషేధాన్ని కచ్చితంగా అమలు చేశారు.

విశాల తీరం

జిల్లా పరిధిలో తుని మొదలుకొని తాళ్లరేవు వరకు సుమారు 94 కిలో మీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ఏడు తీర ప్రాంత మండలాలు ఉండగా 58 మత్స్యకార హేబిటేషన్లు ఉన్నాయి. సుమారు 1,95,184మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 36,101మంది సముద్రంలో చేపల వేట ద్వారా ఉపాధి పొందుతున్నారు. మొత్తం 23 చోట్ల ఫిష్‌ ల్యాండింగ్‌ సదుపాయం ఉండగా కాకినాడలో కమ్యూనికేషన్‌ స్టేషన్‌ అందుబాటులో ఉంది. 410 మెకనైజ్డ్‌, 3732 మోటరైజ్డ్‌ బోట్లతో పాటు 287 సంప్రదాయ పడవలు ద్వారా సముద్రంలో చేపలు వేట సాగిస్తున్నారు.

మహిళలు పూజలు

ప్రధానంగా కాకినాడ కుంభాభిషేకం, కాకినాడ షిషింగ్‌ హార్బర్‌, ఉప్పాడ రేవులు వేటకు ప్రసిద్ధి చెందాయి. నిషేధ గడువు ముగియనుండడంతో మత్స్యకార గ్రామాలు సందడిగా మారాయి. గంగమ్మ తల్లి కరుణిస్తే కాసులు వర్షం కురుపిస్తుందని విశ్వసించే మత్స్యకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వలలు వేసేందుకు మరో కొన్ని గంటల్లో పడవల్లో పయనమవ్వనున్నారు. కాకినాడ ఏటిమొగ వద్ద మత్స్యకార మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఇప్పటికే బోట్లకు రంగులు వేసుకుని మరమ్మతులు పూర్తి చేసుకున్న మత్స్యకారులు, ఇప్పుడు పది రోజుల వేటకు సరిపడేలా డీజిల్‌, ఐస్‌ నిల్వలు సిద్ధం చేసుకుంటున్నారు. వలలను వేటకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

ఆశలు ఫలించాలని..

మత్స్యకారులు ఈ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లుగా చేపలు చిక్కక..మరో పక్క డీజిల్‌ ధరల భారంతో చాలా మంది వేటకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వేట ద్వారా జీవనోపాధి లభిస్తుందని ఆశపడుతున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి మొదలుకొని దాదాపు 10 నెలల పాటు వేటతోనే జీవనం సాగించనున్నారు.



కాకినాడ కుంభాభిషేకం వద్ద చేపల వేట కోసం బోట్లలో వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

చేపల వేట సాగించవచ్చు

ఏప్రిల్‌ 14నుంచి జూన్‌ 14వరకు వేట నిషేధానికి మత్స్యకారులు సహకరించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేట సాగించుకోవచ్చు. నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు రూ.10వేలు చొప్పున అందించి ఆదుకుంది. చేపల వేటలో తగిన జాగ్రత్తలు పాటించాలి. తుపాను సమయంలో హెచ్చరికలను పాటించాలి.

– పి.వి.సత్యనారాయణ, మత్స్యశాఖ జిల్లా అధికారి

నిషేధ సమయంలో సాయం

వేట నిషేధ సమయంలో మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్సార్‌ మత్స్యకార భరోసా పథకం ద్వారా కుటుంబానికి రూ.10వేలు చొప్పున వేట నిషేధ భృతిని వరసగా ఈ ఏడాది కూడా ఇటీవల అందించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.4వేలు మాత్రమే ఇవ్వగా ఈ ప్రభుత్వం రూ.10వేలు చొప్పున నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేసిందని మత్స్యకారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా మన జిల్లాలో 23147 మందికి రూ.23.14కోట్లు వేట విరామ భృతి జమ చేశారు.

చిన్నారి ఆరోగ్యంపై సీఎం జగన్‌ స్పందన

తక్షణ సాయంగా రూ.లక్ష చెక్కు పంపిణీ



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: తన బిడ్డకు వైద్యం అందించాలని ఓ తల్లి పెట్టుకున్న అర్జీకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వచ్చిన సందర్భంగా కొవ్వూరు మండలం ఔరంగాబాద్‌కు చెందిన పాక నాగ వెంకట అపర్ణ తన ఏడు నెలల కుమార్తె నిస్సి ఆరాధ్య కిడ్నీ సంబంధిత క్యాన్సర్‌తో బాధపడుతోందని అర్జీ అందజేశారు. సీఎం స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన చాంబర్‌లో నిస్సి తల్లికి రూ.లక్ష చెక్కును కలెక్టర్‌ మాధవీలత అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాధవీలత ఆరాధ్య తల్లితండ్రులు పాక స్వరూప్‌, అపర్ణలకు ధైర్యం చెప్పారు. బిడ్డ ఆరాధ్య అనారోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పాప వైద్య సేవల పర్యవేక్షణ బాధ్యతలను ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌కు అప్పగించామని వివరించారు. పాప తండ్రి మాట్లాడుతూ వైద్య సేవల కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి సీఎం కార్యాలయం లెటర్‌ ఆఫ్‌ అథారిటీ లేఖ ఇచ్చిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ తైక్వాండోలో ముగ్గురికి పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారిణులు

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు మంగళవారం ఈ విషయం తెలిపారు. డెహ్రాడూన్‌లో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకూ 38వ జాతీయ స్థాయి సీనియర్ పూమోస్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని చెప్పారు. ఇందులో పితాని భార్గవి శ్రీకళ (నందంపూడి), కుసుమ వైష్ణవి (అంబాజీపేట), బి.అఖిల (కాకినాడ) ద్వితీయ స్థానంలో నిలిచి, రజత పతకాలు సాధించారని వివరించారు. వీరు మార్చి 12న కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పూమోస్ తైక్వాండో పోటీల్లో విశేష ప్రతిభ చూపారన్నారు. తద్వారా మార్చి 24 నుంచి 26 వరకూ చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి సెలక్షన్లకు ఎంపికై, శిక్షణ పొందారని త్రిమూర్తులు చెప్పారు. ఈ క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మంది అరెస్టు

రూ.1.20 లక్షల జరిమానా విధించిన కోర్టు



జగ్గంపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగ్గంపేట: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జగ్గంపేటతో పాటు జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో పోలీసులు సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మందిని అరెస్టు చేశామని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. వీరిని మంగళవారం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచామని, వీరికి న్యాయమూర్తి రూ.1.20 లక్షల జరిమానా విధించారని వివరించారు. ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగ్గంపేట పరిసరాల్లో రాత్రి 11 గంటలు దాటిన తరువాత గస్తీ ముమ్మరం చేశామని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.



తేటగుంట జంక్షన్‌లో ఆలయంపై కుప్పకూలిన భారీ వృక్షం



తేటగుంటలో కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు



నేలకొరిగిన తోటలను పరిశీలిస్తున్న తుని తహసీల్దార్, నాయకులు

ఈదురు గాలుల బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు
- దెబ్బ తిన్న ఉద్యాన పంటలు

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో తుని, తొండంగి మండలాలతో పాటు, అన్నవరంలో భారీ నష్టం వాటిల్లింది. తుని మండలం తేటగుంట, గవరపేట, టి.వెంకటాపురం తదితర గ్రామాల్లో పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తాకిడికి విద్యుత్ స్తంభాలు, దశాబ్దాల నాటి భారీ వృక్షాలు నేల కూలాయి. ఇళ్లపై పెంకులు, తాటాకులు ఎగిరిపోయాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కనకదుర్గమ్మ ఆలయంపై ఓ భారీ వృక్షం కూలిపోయింది. ఈ సంఘటనల్లో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. రెవెన్యూ, ఏపీ ఈపీడీసీఎల్, ఉద్యాన శాఖల అధికారులు ఆయా గ్రామాలకు హుటాహుటిన చేరుకుని నష్టాన్ని పరిశీలించారు. ప్రాథమికంగా 50 ఇళ్లకు పాక్షికంగా నష్టం వాటిల్లిందని తహసీల్దార్ శివకుమార్ తెలిపారు. 33 కేవీ విద్యుత్ స్తంభాలు మూడు, 11 కేవీ స్తంభాలు 15 నేలకొరిగాయని ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ చెప్పారు. విద్యుత్ సరఫరాను పునద్ధరించే పనులను యుద్ధప్రాతిపదికన



రత్నగిరిపై పడిపోయిన గ్రీన్ నెట్స్

చేపట్టామన్నారు. 30 హెక్టార్లలో అరటి, 10 హెక్టార్లలో మామిడి, 10 హెక్టార్లలో జీడిమామిడి, 10 హెక్టార్లలో కొబ్బరి తోటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి వివరించారు. బుధవారం క్షేత్రస్థాయికి వెళ్లి పూర్తి స్థాయి అంచనాలు రూపొందిస్తామని చెప్పారు. జాతీయ రహదారిపై కుప్పకూలిన చెట్లను హైవే నిర్వాహక సంస్థ ప్రతినిధులు తొలగించారు. జరిగిన నష్టాలను అధికారులకు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు, నాయకుడు గణేషుల వీరబాబు వివరించారు.



రత్నగిరి అనివేటి మంటపం వద్దకు వచ్చిన వర్షపు నీరు

రత్నగిరిపై..

అన్నవరం: ఈదురు గాలుల తాకిడికి రత్నగిరిపై సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో భక్తులకు నీడ కోసం వేసిన గ్రీన్ షెడ్స్ కుప్పకూలాయి. ఘాట్ రోడ్‌లో పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అరగంటలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భక్తులు తమ పిల్లల బరువుకు సరిసమానంగా పటిక బెల్లం, నాణాలు సమర్పించేందుకు ఏర్పాటు చేసిన 'తులాభారం' సైతం గాలి తాకిడికి పడిపోయింది. భారీ వర్షంతో దర్బారు మండపం వద్ద క్యూలైన్ల నిర్మాణం, ఇతర పనులకు తీవ్ర అంతరాయం కలిగింది. గాలి వెలుతురు కోసం ఈశాన్య మార్గంలో గోడలను తొలగించి గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వాటి నుంచి జల్లు లోపలకు రావడంతో అనివేటి మండపం ముందు వైపునకు వాననీరు వచ్చేసింది. వర్షం తగ్గాక ఆ నీటిని బయటకు తరలించారు. అన్నవరం గ్రామంలో కూడా పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. దీంతో సాయంత్రం 5 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి 7.30 గంటలకు చాలాచోట్ల విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు.

కుండపోత వర్షం

తొండంగి: మండలంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు గంటన్నర పాటు కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచీ 43 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై బలమైన ఈదురు గాలులు వీచాయి. పలు ప్రాంతాల్లో హోర్డింగులు, చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పెను గాలుల వేగానికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జి.ముసలయ్యపేటలో పిడుగుపాటుకు పొలంలో మేతకు తీసుకెళ్లిన యాదాల తాతారావు పాడిగేద మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని తాతారావు చెప్పాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చెట్టు కూలి వ్యక్తి మృతి



చెట్టు కూలి మృతి చెందిన రాజులు

రౌతులపూడి: మండలంలోని గిడజాం ఎస్సీపేట సమీపాన ఈదురు గాలుల తాకిడికి దశాబ్దాల కాలం నాటి మర్రిచెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ సంఘటనలో ఆ చెట్టు కింద ఉన్న అదే గ్రామానికి చెందిన పులుగు రాజులు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సేద తీరేందుకు రాజులు ఆ చెట్టు కింద ఉన్న సిమెంటు దిమ్మపై కూర్చున్నాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా గాలి వీయటంతో ఒక్కసారిగా ఆ మర్రి చెట్టు నేలకొరిగి ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిపోయింది. ఆ చెట్టు వేళ్లు పెగలి రాళ్లు మీద పడటంతో రాజులు తీవ్రంగా గాయపడి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. రాజులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆటో డ్రైవర్, ప్రయాణికులపై దుండుగుల దాడి

సామర్లకోట: ప్రయాణికుల మాదిరిగా ఆటో ఎక్కిన గుర్తు తెలియని దుండగులు డ్రైవర్‌తో పాటు, మహిళా ప్రయాణికులపై దాడికి పాల్పడి, బంగారు ఆభరణాలు దోచుకున్నారు. ఈ సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో సంచలనం రేపింది. పోలీసుల మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్తున్న ఆటోలో ఓ మహిళతో పాటు మొత్తం 8 మంది ప్రయాణికులు ఎక్కారు. పిఠాపురం రోడ్డులో నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలో ఆ దుండగులు హఠాత్తుగా డ్రైవర్‌పై కత్తితో దాడి చేశారు. మహిళలపై కూడా దాడి చేసి వారి మెడలోని బంగారు ఆభరణాలు తీసుకొని పరారయ్యారు. గాయపడిన ఇద్దరు మహిళలను, ఆటో డ్రైవర్‌ను సామర్లకోట ఆస్పత్రికి తరలించారు. దొంగలు పిఠాపురం వైపు పరారవడంతో పిఠాపురం పోలీసులకు కూడా సమాచారం



సామర్లకోట ఆస్పత్రిలో బాధిత మహిళ నుంచి సమాచారం సేకరిస్తున్న పోలీసులు

ఇచ్చారు. అనుమానాస్పదంగా కనిపించిన బీహార్‌కు చెందిన ఒక వ్యక్తిని పిఠాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సామర్లకోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ నుంచి పోలీసులు వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

'మహాప్రస్థానం' డ్రైవర్‌పై ఫిర్యాదు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో మహాప్రస్థానం వాహనం డ్రైవర్ వ్యవహార శైలి వివాదానికి దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వర్మ అనే వ్యక్తి మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని జీజీహెచ్ నుంచి స్వస్థలానికి మహాప్రస్థానం వాహనంలో తరలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబీకులు ఓ వైపు వార్డులో నర్సు ద్వారా తరలింపు ప్రక్రియ వివరాలు రాయిస్తూనే.. ఈ విషయాన్ని మహాప్రస్థానం వాహనం డ్రైవర్ దడాల రాముకు చెప్పారు. ఆ సమయంలో వారితో రాము దురుసుగా ప్రవర్తించాడు. మీరు ఫలానా అని చెప్పక్కర్లేదనీ, సిఫారసులు చేసినంత మాత్రాన తన పై అధికారి వచ్చి వాహనం నడపడనీ వెటకారంగా మాట్లాడాడు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించిన తర్వాత డబ్బులిస్తేనే వస్తానని, లేకుంటే రావడం కుదరదని చెప్పాడు. కంగు తిన్న బాధిత కుటుంబీకులు ప్రభుత్వం ఉచితంగా సేవలందిస్తుంటే ఈ డబ్బుల డిమాండ్ ఏమిటని నిలదీశారు. దీంతో రాము వారిపై మండిపడి, అరుస్తూ మృతదేహాన్ని వదిలేసి అక్కడి నుంచి వెళ్లి పోయాడు. దీనిపై మృతుడి కుటుంబీకులు మహాప్రస్థానం జోనల్ మేనేజర్ గంగరాజుకు ఫోనులో ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఆయన డ్రైవర్ రాముపై చర్యలకు హామీ ఇచ్చారు. మరో డ్రైవర్‌తో వాహనాన్ని ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. డ్రైవర్ రాముపై జీజీహెచ్ ఉన్నతాధికారులకు బాధిత కుటుంబీకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 15,768 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశారు. వీరిలో 3,668 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 1,606 మంది రాయగా 4,893 మంది పాసయ్యారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల నుంచి 10,458 మంది రాయగా, 3,604 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 10,200 మంది పరీక్షలు రాయగా 3,360 మంది పాసయ్యారు.

రిమాండ్ ఖైదీల మరణాలపై 23న మెజిస్టీరియల్ విచారణ

కాకినాడ సిటీ: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రిమాండ్ ఖైదీలు రేవు ధనరాజు, రాజేష్ విజయన్ మృతిపై ఈ నెల 23వ తేదీన మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నారు. కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ధనరాజు గత ఏడాది డిసెంబర్ 7న కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. విజయన్ కూడా ఈ ఏడాది ఫిబ్రవరి 5న జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. వీరిద్దరి మరణాలపై అప్పట్లో కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా సంబంధిత సాక్షులు, పోలీసులు, మృతుల బంధువులు, వైద్యులకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

40 కాసుల బంగారం చోరీ

పెదపూడి: పట్టపగలు దుండగులు ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు అపహరించుకుపోయిన సంఘటన గొల్లల మామిడాడలో సంచలనం రేపింది. పెదపూడి ఎస్సై పి.వాసు మంగళవారం ఈ వివరాలు తెలిపారు. జి.మామిడాడ మండా వారి వీధిలో మేడపాటి రామారెడ్డి, భార్య, కుమారుడు నివసిస్తున్నారు. రామారెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తారు. కుమారుడు ఫైనాన్స్ లైన్ల నిమిత్తం దూర ప్రాంతం వెళ్లాడు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామ శివారు పాటి మీద గృహప్రవేశానికి రామారెడ్డి దంపతులు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టిన గుర్తు తెలియని దుండగులు బెడ్‌రూమ్ బీరువాలోని సుమారు 40 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బీరువాలోని దుస్తులు, ఇతర వస్తువులను చిందరవందగా పడేశారు. చోరీపై రామారెడ్డి వెంటనే పెదపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వాసుతో పాటు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. సమీపంలో సీసీ కెమెరాలు ఎక్కడున్నాయో పరిశీలించారు. ముగ్గురు యువకులు ఒక మోటార్ బైక్‌పై వచ్చి ఈ చోరీకి పాల్పడినట్టు సీసీ ఫుటేజీలో ఉందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

231 సెల్‌ఫోన్ల రికవరీ

కాకినాడ క్రైం: చోరీ అయిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు 'మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్' సేవలకు ఫిర్యాదు చేశారన్నారు. దశల వారీ తనిఖీలు, నిఘా ద్వారా ఆ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం రూ.40 లక్షల విలువైన చేసే 231 ఫోన్లను బాధితులకు ఎస్పీ అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

వరదలపై పరిశోధనకు పేటెంట్ హక్కులు



డాక్టర్ సూరిబాబును అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: వరదలపై ముందస్తు సమాచారం తెలుసుకోవడంతో పాటు ఆ సమయంలో నదుల్లో సంభవించే ప్రమాదాల కారణంగా జరిగే ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించేందుకు చేపట్టే రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించి చేసిన పరిశోధనకు కేంద్ర ప్రభుత్వం నుంచి పేటెంట్ హక్కులు లభించాయి. డాక్టర్ దువ్వూరి రాజేష్, ప్రొఫెసర్ పి.జగదీశ్వరరావు, డాక్టర్ జి.నరసింహరావు, డాక్టర్ బోయిడి సూరిబాబు ఒక బృందంగా ఏర్పడి 'మల్టీ ఫంక్షనల్ కాస్ట్ ఎఫెక్టివ్ స్మార్ట్ పోల్' పేరిట ఈ పరిశోధన చేశారు. వీరిలో సూరిబాబు ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సివిల్ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. వీరు పేటెంట్ హక్కుల కోసం తమ పరిశోధన వివరాలను ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంత్ పురుషోత్తం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. దీనికి కేంద్రం నుంచి ఆమోదం లభించిందని 'నన్నయ' వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బోయిడి సూరిబాబును అభినందించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని, మిగిలిన వారి నుంచి కూడా మరిన్ని మెరుగైన పరిశోధనలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఓడీ వర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'నన్నయ'లో రీజినల్ క్లస్టర్ ఆఫ్ గోదావరి డిస్ట్రిక్ట్ గేమ్స్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 23, 24 తేదీల్లో రీజినల్ క్లస్టర్ ఆఫ్ గోదావరి డిస్ట్రిక్ట్ గేమ్స్ నిర్వహించనున్నామని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఏపీ ఉన్నత విద్యా ప్రణాళికా మండలి ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ సహకారంతో నిర్వహించే ఈ గేమ్స్ బ్రోచర్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. 'నన్నయ' వర్సిటీ, జేఎన్‌టీయూకే, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఎన్ఐటీ తాడేపల్లిగూడెం క్లస్టర్‌గా ఏర్పడి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ గేమ్స్ నిర్వహిస్తున్నామని వీసీ వివరించారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, చదరంగం వంటి పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ఆయా వర్సిటీల నుంచి మహిళలు, పురుషులు జట్లుగా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వీసీ ఆచార్య పద్మరాజు సూచించారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా 94402 12188 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పి.గన్నవరం: అత్తింటి వారి నుంచి కట్నం వేధింపులు తాళలేక ఒక వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముంగండపాలెం శివారు గాజులగుంటలో జరిగింది. పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం భీమలాపురానికి చెందిన ప్రసన్న (23), గాజులగుంట గ్రామానికి చెందిన బూడిద యువరాజులు ఏడాదిన్నర క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి కట్నం తీసుకురాలేదని ప్రసన్నను అత్తింటి వారు వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి వేధింపులు తాళలేక ఈనెల 12న ప్రసన్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈవిషయం తెలుసుకున్న ప్రసన్న తండ్రి పార్థసారథి గాజులగుంట గ్రామానికి వచ్చారు. ప్రసన్నను ఆమె అత్త విజయలక్ష్మి, ఆడపడుచు అరుణ, బావ, పెద్ద అత్తలు వేధిస్తున్న కారణంగానే ఆమె మరణించిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్థసారథి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

ఆస్తి కోసం దురాగతం

- బతికుండగానే చనిపోయినట్టు తప్పుడు రికార్డులు
- టీడీపీ నాయకులతో చేతులు కలిపిన రెవెన్యూ అధికారులు
- గుట్టు చప్పుడు కాకుండా పేర్లు మార్పు
- కలెక్టర్, ఎస్పీలకు బాధిత వితంతువు ఫిర్యాదు



తాతిన అమ్మాజీ

నల్లజర్ల: తన ఆస్తి కాజేయడానికి టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించారని ఓ ఒంటరి వితంతువు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలతకు మంగళవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె నల్లజర్లలో మీడియాకు వివరించారు. ఆమె కథనం ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలేనికి చెందిన తాతిన వెంకటకృష్ణ రంగారావుకు, అమ్మాజీకి 2007లో వివాహమైంది. వీరికి ప్రకాశరావుపాలెంలో ఇల్లు, స్థలాలు, వ్యవసాయ భూములు ఉన్నాయి. వెంకటకృష్ణ రంగారావు 2019లో మృతి చెందారు. వారికి పిల్లలు లేకపోవడంతో అమ్మాజీ తణుకులోని సోదరుడి వద్ద ఉంటోంది. ప్రకాశరావుపాలెంలోని ఆమె ఆస్తిపై రంగారావు సోదరి, విశాఖపట్నానికి చెందిన లంకసాని కృష్ణవేణి, ఆమె భర్త చక్రధరావు, అల్లుడు అనుపిండి శ్రీనివాస్ కన్ను వేశారు. తామే ఆ ఆస్తికి వారసులమని ప్రకటించుకున్నారు. వారికి ప్రకాశరావుపాలేనికి చెందిన టీడీపీ నాయకులు బోయపాటి గంగరాజు, దేవిన సురేష్, దుద్దుపూడి బ్రహ్మారాజు, నారకొండ దుర్గాప్రసాద్, దుద్దుపూడి హరేరాం, బోయపాటి సుబ్బారావు మద్దతు పలికారు. వీరందరూ రెవెన్యూ అధికారులతో చేతులు కలిపారు. అమ్మాజీ చనిపోయినట్టు రికార్డులు సృష్టించారు. దీనికి అప్పట్లో ఆర్ఐగా పని చేసిన లక్ష్మీనారాయణ, వీఆర్ఓలు టి.సీతారామరాజు, ఎ.వరలక్ష్మి సహకరించారు. టీడీపీ నాయకులతో కలిసి అమ్మాజీ చనిపోయినట్టు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పాత రికార్డులపై ప్రస్తుత ఆర్ఐ కూడా పాత తేదీలతో సంతకాలు చేశారు. అనంతరం రెవెన్యూ రికార్డుల్లో రంగారావు ఆస్తులను కృష్ణవేణి పేరిట మ్యుటేషన్ చేశారు. దీనికిగాను రెవెన్యూ శాఖలో ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, రెవెన్యూ కార్యాలయానికి రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ.25 లక్షల వరకూ ముడుపులు ముట్టజెప్పారని అమ్మాజీ ఆరోపించారు. కరోనా సమయంలో అనారోగ్యంతో ఉన్న తనకు ఈ వ్యవహారం తెలియలేదన్నారు. తర్వాత అనుమానం వచ్చి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరడంతో ఈ అక్రమం వెలుగులోకి వచ్చిందన్నారు. దీనిపై దర్యాప్తు చేసి, తనకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని అమ్మాజీ తెలిపారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీకి కూడా వినతి పత్రం అందించానని చెప్పారు.

అధిక డిమాండులోనూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ మూర్తి

రాజమహేంద్రవరం సిటీ: ప్రస్తుత వేసవిలో అధికంగా డిమాండ్ ఉన్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రోజుకు అత్యధికంగా 23 మిలియన్ యూనిట్ల మేర విద్యుత్ వినియోగం జరుగుతోందన్నారు. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసినప్పుడు, సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. దీనిపై తక్షణమే స్పందించి, సకాలంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామని పేర్కొన్నారు. పెద్దాపురం 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం రాత్రి 9.52 గంటలకు బస్ ఐసోలేటర్-2 క్లాంప్స్ కాలిపోయి, జంపర్ తెగిపోయిందని, దీంతో 220 కేవీ కాకినాడ సబ్‌స్టేషన్లోని 3 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయ్యాయని తెలిపారు. దీని ప్రభావంతో కాకినాడ, పెద్దాపురం, పాయకరావుపేట, ప్రతాప్ నగర్, సిల్క్ రోడ్ సుగర్స్, గొల్లపాలెం, ముమ్మిడివరం, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం విద్యుత్ సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో, ఈపీడీసీఎల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పని చేసి, జిల్లా కేంద్రాలకు, పట్టణాలకు రాత్రి 11 గంటలకు, మండల కేంద్రాలకు, విద్యుత్ ఉపకేంద్రాలున్న ఫీడర్లకు రాత్రి 11.15 గంటలకు, మిగిలిన అన్ని ప్రాంతాలకూ రాత్రి 2.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని ఎస్ఈ మూర్తి వివరించారు.